క్లుప్తంగా

జర్నలిస్టుల కాలనీ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే కన్నా

గుంటూరు రూరల్: చౌడవరం జర్నలిస్టుల కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని మాజీ మంత్రి, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హామీ ఇచ్చారు. ఇటీవల చేతికి ఆపరేషన్ చేయించుకున్న కన్నాను శనివారం గుంటూరు జర్నలిస్టులు పరామర్శించారు. కన్నావారి తోటలోని ఆయన నివాసానికి చేరుకుని చౌడవరం జర్నలిస్టుల కాలనీ గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి అన్నివిధాలా సాయం చేస్తానన్నారు. త్వరలోనే సందర్శిస్తానని మాటిచ్చారు. జర్నలిస్టు కాలనీ అధ్యక్షులు పొగర్తి నాగేశ్వరరావు, కార్యదర్శి ఎం. మురళీమోహన్, సీనియర్ జర్నలిస్టులు కన్నాను కలిసిన వారిలో ఉన్నారు.

ప్రభుత్వ బడుల్లో సకల వసతులు



కాకుమాను: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తున్నట్లు ఎంఈఓ కేఎఫ్ కెనడీ అన్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు శనివారం షూ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కెనడీ మాట్లాడుతూ విద్యార్థులకు ఉచిత యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, షూ, బెల్టు వంటివి అందజేస్తున్నట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 విజయ్ భాస్కర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్షిత తాగునీటి సరఫరాకు ఆదేశం



పెదకాకాని: పరిశుభ్రమైన తాగునీరు ప్రజలకు సరఫరా చేయాలని గుంటూరు డివిజన్ పంచాయతీ అధికారి వీవీఎం లక్ష్మణరావు అన్నారు. పెదకాకాని గ్రామంలో రక్షిత మంచినీటి పథకం, వాటర్ స్కీం, పారిశుద్ధ్య నిర్వహణ తీరును ఆయన పరిశీలించారు. రక్షిత మంచినీటి సరఫరాకు సంబంధించిన ఫిల్టర్‌బెడ్‌లు, వాటర్ ట్యాంక్ క్లీనింగ్, నీటి నాణ్యత పరీక్షలు వంటి అంశాలను పరిశీలించారు. గ్రామంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణపై సమీక్షించారు. పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం. రాజారాం, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన భక్తి సంగీత విభావరి



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై కళాలయ మెలో డీస్ ఆధ్వర్యంలో 24వ భక్తి సంగీత విభావరి నిర్వహించారు. ఆలయ పాలకమండలి అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, ఉపాధ్యక్షులు వూటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఏవీ రత్నాజీ అధ్యక్షత వహించారు. గాయకులు పి.మొగిలి, ఈ.భరత్‌రెడ్డి, ఏవీ.రత్నాజీ సినీ, భక్తి గీతాలు ఆలపించారు. ప్రేక్షకులను అలరించాయి. కీబోర్డ్‌పై కె.రవి, తబలాపై ఎస్.వెంకట్, పాడ్స్‌పై ప్రసాద్ చక్కటి వాయిద్యా సహకారాన్ని అందించారు.

ఇంట్లో చోరీ

గుంటూరు ఈస్ట్: ఇంట్లో చోరీ ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. విద్యానగర్ 3వలైనులో నివాసం ఉండే గుజ్జర్లపూడి సురేష్ కుటుంబ సభ్యులతో కలసి ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లారు. శనివారం పని మనిషి ఇంటికి వచ్చి తలుపులు తీసి ఉండటం గమనించి లోపలకు వెళ్లి పరిశీలించింది. సామన్లు చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో పనిమనిషి సురేష్‌కు సమాచారం ఇచ్చింది. సురేష్ ఇంటికి వచ్చి చూసుకోగా, 68 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక డైమండ్ కనిపించలేదు. సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచారం నిర్వహిస్తున్న మహిళలపై కేసు

గుంటూరు ఈస్ట్: వ్యభిచారం నిర్వహిస్తున్న మహిళలపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏటీ అగ్రహారం జీరోలైనులో ఓ నివాసంలో ఉండే ఓ మహిళ వ్యభిచారం నిర్వహిస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు శనివారం దాడి చేసి ఆమెతోపాటు, మరో ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు ప్రకృతితో అనుబంధం అవసరం



జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వివా పాఠశాల పాలకమండలి సభ్యురాలు వాసిరెడ్డి అరుణ

పెదకాకాని: విద్యార్థులు ప్రకృతితో అనుబంధం కలిగి ఉండాలని వివా పాఠశాల పాలకమండలి సభ్యురాలు డాక్టర్ వాసిరెడ్డి అరుణప్రియ అన్నారు. వివా ది స్కూల్ విద్యార్థులు ఈ నెల 1 నుంచి 6వ తేదీ వరకు వారంపాటు వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం డాక్టర్ అరుణప్రియ మాట్లాడుతూ.. మొక్కలు నాటడంతోపాటు వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మొక్కలలోని ఔషధగుణాలు అనేక ఆరోగ్య సమస్యలకు పరిష్కారం చూపుతాయని తెలిపారు. ఈ మేరకు గ్రీన్ ర్యాలీ నిర్వహించి, ప్రతి విద్యార్థితో పాఠశాల ప్రాంగణంలో ఓ మొక్క నాటించారు. జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. వన మహోత్సవానికి సంబంధించిన హరిత ప్రచారం, మొక్కలు వాటి ఔషధ గుణాలపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీహెచ్ సరళ, డైరెక్టర్ ఎల్టీ కమాండర్ కె. శ్రీనివాసరావు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడంతోపాటు సంరక్షించాలి



ఏఎల్ బీఈడీ కళాశాల ప్రాంగణంలో మొక్క నాటుతున్న ఎస్తేరు సునీల, వినయ్‌కుమార్



శ్రీపూజిత స్కూల్లో మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్ పద్మావతి

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలోని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టాలని ఏఎల్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాదాసు ఎస్తేరు సునీల పేర్కొన్నారు. శనివారం వన మహోత్సవం సందర్భంగా లాడ్జి సెంటర్లోని ఏఎల్ బీఈడీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఎస్తేరు సునీల మాట్లాడుతూ మొక్కలు జీవ వైవిధ్యాన్ని కాపాడుతూ, పర్యావరణ పరిరక్షణలో ప్రముఖ పాత్ర పోషిస్తాయని, భవిష్యత్ ఆరోగ్య భద్రతకు పాటు పడతాయని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగ అధికారి ఎం.వినయ్‌కుమార్, కళాశాల మేనేజర్ డాక్టర్ ఎస్ఏ వెస్లీ పాల్గొన్నారు.

వన సంరక్షణపై దృష్టి సారించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే వన సంరక్షణపై దృష్టి సారించాలని శ్రీపూజిత స్కూల్ ప్రిన్సిపాల్ కంచర్ల పద్మావతి పేర్కొన్నారు. పట్టాభిపురంలోని శ్రీపూజిత స్కూల్లో శనివారం వన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పద్మావతి మాట్లాడుతూ మానవ అవసరాలకు అడవులను నరికివేయడం వలన పర్యావరణ సమతుల్యత దెబ్బ తింటోందని అన్నారు. జూలై నెలలో వేసవిని తలపించే ఎండలకు చెట్ల నరికివేత కారణమన్నారు. మొక్కలకు ప్రాణం ఉంటుందని, మనుషుల వలే అవి కమ్యూనికేషన్ చేసుకుంటాయని పరిశోధనల్లో రుజువైందని వివరించారు. మొక్కలను నాటి వాటిని పరిరక్షించాలని సూచించారు. ఈసందర్భంగా విద్యార్థులకు పూలు, పండ్ల మొక్కలను పంపిణీ చేశారు.



గ్రీన్ ఇండియా కార్యక్రమ ర్యాలీలో ప్రిన్సిపాల్ భారతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు

పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ

గుంటూరు ఎడ్యుకేషన్: నెహ్రూనగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రామ్ కింద గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ డి.భారతి ఆధ్వర్యంలో విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ చాటుతూ ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. భారతి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు చెట్లు ఎంతో కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఈసందర్భంగా పాఠశాల చుట్టు పక్కల ప్రాంతాల్లో విద్యార్థులతో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో డీన్ దుర్గారావు, పీఈటీ రవిబాబు పాల్గొన్నారు.

డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు



గుంటూరు మెడికల్: అమ్మ కోసం చెట్టు కార్యక్రమం బీజేపీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని పాలపాటి రవికుమార్ ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గంలోని 4వ మండలం అరండల్ పేట వావిలాల సంస్థ ప్రాంగణంలో మొక్కలు నాటారు. తొలుత శ్యామప్రసాద్ ముఖర్జీ, వావిలాల గోపాలకృష్ణయ్య చిత్రపటంకు పూల మాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ దేశ ఐక్యతకు కృషి చేసిన మహోన్నత వ్యక్తి శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో పెద్దింటి కష్ణ చైతన్య, ఈదర శ్రీనివాసరెడ్డి, సుకన్య, వెలగలేటి గంగాధర్, మంత్రి సుగుణ, పద్మనాభం, వావిలాల సత్యం, యనమండర శ్రీనివాస్, ఈమని మాధవరెడ్డి, బజరంగ్ రామకృష్ణ, వక్కలగడ్డ తిరుమలరావు, పద్మనాభుని రమాదేవి, జితేంద్ర గుప్తా, కష్ణమూర్తి, చింతపల్లి వెంకట్, చంద్రశేఖర్, గోకుల్, మందలపు సురేష్, చిన్ని, ఆవుల వెంకటేశ్వరరావు, సాంబశివరావు, ప్రకాశరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామగ్రి అందజేత



గుంటూరు ఎడ్యుకేషన్: పాత గుంటూరులోని యాదవ హైస్కూల్లో 2009-10 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారు. ఈసందర్భంగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, జామెట్రీ బాక్సులు, వాటర్ బాటిళ్లను పూర్వ విద్యార్థులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అంజయ్య, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, హెచ్ఎం రాజ్యలక్ష్మి, జి.ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్యామలానగర్‌లో సహకార జెండా ఆవిష్కరణ



నగరంపాలెం: స్థానిక శ్యామలానగర్ సహకార శాఖ, కమిషనర్, సహకార సంఘాల రిజిస్ట్రార్ కార్యాలయం(ఏపీ) ప్రాంగణంలో శనివారం 102వ ఇంటర్నేషనల్ కో-ఆపరేటివ్ దినోత్స వేడుకలు నిర్వహించారు. అదనపు రిజిస్ట్రార్ ఆనందబాబు కో-ఆపరేటివ్ జెండాను ఆవిష్కరించారు. 102వ ఇంటర్నేషనల్ కో- ఆపరేటివ్ దినోత్సవ ప్రత్యేకతను ఆయన వివరించారు.

ఏటీఎం కార్డు చోరీపై కేసు

గుంటూరు ఈస్ట్: ఏటీఎం కార్డు పోగొట్టుకున్న ఘటనపై పాతగుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. నరసరావుపేటకు చెందిన కట్టెపోగు రామారావు గతనెల 24న ఆర్టీసీ బస్టాండ్‌లో ఏటీఎం కార్డు పోగొట్టుకున్నాడు. అనంతరం రామారావు అకౌంట్‌లో రూ.1.98 లక్షలు విత్‌డ్రా అయ్యాయి. ఘటనపై రామారావు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం



సాంస్కృతిక కార్యకమాలలో విద్యార్థులు



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

మంగళగిరి: జీవితంలో ఉన్నత స్థానాలకు చేరాలంటే విద్యార్థులకు చిన్నతనం నుంచే క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమని రూరల్ సీఐ యార్లగడ్డ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట ఉన్న నిర్మల ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో శనివారం పదో తరగతి విద్యార్థులకు లీడర్లుగా ఎంపికైన వారికి ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో మార్చ్ ఫాస్ట్ చేయించారు. ముఖ్య అతిథిగా హాజరైన రూరల్ సీఐ మాట్లాడుతూ నూతనంగా ఎంపికైన లీడర్లు విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలన్నారు. కరస్పాండెంట్ సిస్టర్ జాన్ పాల్ మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలను అలవరుచుకోవాలన్నారు. హెచ్ఎం సిస్టర్ జ్ఞాన సుందరి గతేడాది క్యాథలిక్ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు నగదు బహుమతులు, మిఠాయిలు పంపిణీ చేశారు. పాఠశాలలో స్కౌట్స్ గైడ్స్‌లో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు సర్టిఫికేట్‌లను అందజేసి, సీఐని ఘనంగా సత్కరించారు.

బీజామృతంతో అధిక పంట దిగుబడి



తయారీ విధానం పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ డైరెక్టర్ హర్షవర్ధన్

ఫిరంగిపురం: బీజామృతంతో పంటను ఆశించే చీడపీడలు తొలిగి.. దిగుబడి అధికంగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయం మోడల్ మేకర్స్ వెంకటేశ్వర్లు, అన్నామణి పేర్కొన్నారు. మండల మహిళా సమాఖ్య సమావేశం మండల కేంద్రంలోని మహిళా మార్ట్‌లో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ డైరెక్టర్ హర్షవర్ధన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రకృతివ్యవసాయ మాస్టర్ ట్రైనర్ చింతా వరప్రసాద్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో రైతులు తమ భూములు సారవంతం చేసుకుంటున్నారని చెప్పారు. పంటలను ఆశించే చీడపీడల నివారణ చర్యలకు సంబంధించి మెలుకువలు తెలియజేశారు. రసాయనాల జోలికి పోకుండా రైతులు కషాయాలు, ద్రావణాలు ఉపయోగించి పంటను ఆశించే చీడపీడలను నివారించవచ్చని తెలిపారు. అనంతరం విత్తనశుద్ధి వారోత్సవాల సందర్భంగా బీజామృతం తయారీ గురించి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వివరించారు. దానిని తయారు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సమాధానం, మోడల్ మేకర్స్ ఇ. వెంకటేశ్వర్లు, అన్నామణి, డీసీఎంలు రాంబాబు, పీడీసీసీ వెంకటరావు, అడిషనల్ పీడీ నారాయణరావు, సీసీలు లక్ష్మి, మేరి, సుబ్బారావు, ధనమ్మ, పద్మజ, ఎమ్మెస్‌ఓబీలు చిరంజీవి ధనలక్ష్మి జ్యోతి, ఎ.రామకృష్ణ, తిరుపతిరావు, కె.అమల పాల్గొన్నారు.

సీపీఎం కార్యకర్తపై దాడి అమానుషం

జిల్లా కార్యదర్శి పాశం రామారావు

లక్ష్మీపురం: పల్నాడు జిల్లా రొంపిచర్ల మండల సీపీఎం నాయకుడు, మాజీ సర్పంచి కామినేని రామారావుపై తెలుగుదేశం కార్యకర్తలు దాడి చేయడాన్ని అమానుషం అని జిల్లా కార్యదర్శి పాశం రామారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయన మాట్లాడుతూ ఈ నెల ఒకటిన గ్రామంలో పెన్షన్లు రానివారిని జిల్లా కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి అర్జీ అందించడం జరిగిందని చెప్పారు. టీడీపీ నాయకులు రామారావుపై దాడిచేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. ప్రస్తుతం కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షునిగా పనిచేస్తున్నారని గుర్తు చేశారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే వారిపై దాడి చేయడం సరికాదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నిందుతులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

జూలై 7,8న రాజకీయ శిక్షణ తరగతులు..

సీపీఎం గుంటూరు జిల్లా కార్యకర్తల జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ఈ నెల 7,8 తేదీలలో 2/7 బ్రాడిపేటలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి పాశం రామారావు శనివారం తెలిపారు. శిక్షణ తరగతులకు శాఖ కార్యదర్శులు, మండల పట్టణ కమిటీ సభ్యులు, ఎంపికయిన కార్యకర్తలు తప్పని సరిగా హాజరు కావాలని కోరారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో పోటీలు

ఏఎన్‌యూ: ఏబీవీపీ 75వ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పలు అంశాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం నాయకుడు పవన్‌కుమార్ తెలిపారు. జూలై 9న వ్యవస్థాపక దినోత్సవాన్ని నేషనల్ స్టూడెంట్స్ డేగా జరుపుతున్నామని, ఈసందర్భంగా ముందస్తుగా విద్యార్థులకు రెండు కిలో మీటర్ల పరుగు, పలు అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని, కంటి వైద్య శిబిరం, తలసేమియా బాధితులకు రక్త దాన శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన



భోజన పథకం అమలు తీరును తెలుసుకుంటున్న విజయలక్ష్మి

గుంటూరు రూరల్: పీఎం పోషణ (మధ్యాహ్న భోజన పథకం) అమలు తీరును గుంటూరు సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి. విజయలక్ష్మి శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. మండలంలోని గోరంట్లలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆమె స్వయంగా భోజనం తిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భోజనం తినేలా కృషి చేయాలని సూచించారు. నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని తెలిపారు. మెనూ ప్రకారం అంతా ఉండాలని ఆదేశించారు. అవకతవకలు జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో గుంటూరు తూర్పు మండలం విద్యాశాఖ అధికారి నాగేంద్రమ్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మలింగేశ్వరుడి సేవలో శబరిమల పండితులు





దేవస్థానం వద్ద శబరిమల మాలికాపురం మున్‌మేల్ శాంతి ఎంఎన్ రిజికుమార్ నంబూద్రి, ఏబీవీపీ జాతీయ అధ్యక్షుడు కె. అయ్యప్పదాస్ తదితరులు

చేబ్రోలు: చారిత్రక ప్రసిద్ధి చెందిన చేబ్రోలులోని చతుర్ముఖ బ్రహ్మలింగేశ్వరస్వామిని శనివారం కేరళ శబరిమల అయ్యప్ప పండితులు, తదితరులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శబరిమల మాలికాపురం మున్‌మేల్ శాంతి ఎంఎన్ రిజికుమార్ నంబూద్రి, ఏబీవీపీ జాతీయ అధ్యక్షుడు కె. అయ్యప్పదాస్‌లు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దేవస్థానం విశిష్టతను అర్చకులు వారికి వివరించారు. శ్రీరంగనాథ, వీరాంజనేయ, నాగేశ్వరస్వామి దేవస్థానాలలో కూడా వారు పూజలు నిర్వహించారు. అర్చక బృందం వేద ఆశీర్వచనం చేశారు. స్థానిక అయ్యప్ప భక్త బృందం ఘన స్వాగతం పలికింది. అయ్యప్ప ధర్మ ప్రచారసభ ఆధ్వర్యంలో దేశంలోని అన్ని రాష్ట్రాలతోపాటు వివిధ దేశాల్లో కూడా ధార్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఆషాఢ నవరాత్రుల్లో భాగంగా ప్రకాశం జిల్లాలో జరిగే కార్యక్రమానికి వెళ్తూ మార్గమధ్యలో బ్రహ్మదేవాలయ సందర్శనకు వచ్చినట్లు చెప్పారు. స్థానిక భక్త బృందం తిరుపతయ్య గురుస్వామి, ఎం. శ్రీనివాసరెడ్డి, గుంటూరు తిరుపతిరెడ్డి, గోపవరపు రాజా, పి.ప్రసాదరెడ్డి, ఐ. శివరామకృష్ణ, అయ్యప్ప భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పలు విభాగాల పరిశీలన

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో పలు వైద్య విభాగాలను సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ శనివారం పరిశీలించారు. పరిశీలనలో భాగంగా వార్డుల్లో మరుగుదొడ్లలో పేరుకుపోయిన చెత్తను అక్కడ నుంచి తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి ప్రతిరోజూ నాలుగు నుంచి ఐదు వేల మంది రోగులు వస్తున్నారని వారి కోసం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత శానిటేషన్ సిబ్బందిపై ఉందని పేర్కొన్నారు. అత్యవసర చికిత్స విభాగం అడ్వాన్స్‌డ్ ఇంటెన్సివ్ కేర్ వద్ద మరుగుదొడ్లు దుర్గంధపూరితంగా ఉన్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. గుత్తేదారునికి నోటీసు ఇవ్వాలసిందిగా ఆదేశించారు. రెండు ఎగ్జిట్ ఫ్యానులు మరమ్మతులకు గురవడంతో వెంటనే మరమ్మతులు చేయాల్సిందిగా కోరారు. అత్యవసర చికిత్స విభాగం సమీపంలో సీటీ స్కాన్ రూమ్‌లో పలు చోట్ల పెచ్చులు ఊడిపోవడంతో వెంటనే తాపీతో సిమెంట్, కంకర కలిపి డాక్టర్ కిరణ్ కుమార్ సరిచేశారు. మూడేళ్ల నుంచి సీటీ స్కాన్ మూత పడటంతో ఏలుకలు దూరే విధంగా మార్గం ఉండటంతో వాటికి మరమ్మతులు చేసి పరిశుభ్రంగా చేశామని వివరించారు.

మహిళా పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థినుల సమ్మేళనం



గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో శనివారం పూర్వ విద్యార్థినుల సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా 1972 నుంచి వివిధ విద్యాసంవత్సరాల్లో చదివిన పూర్వ విద్యార్థినులు, విశ్రాంత ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు కార్యక్రమానికి హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకరరావు మాట్లాడుతూ 1968లో స్థాపించిన ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో చదివిన ఎంతో మంది విద్యార్థినులు వివిధ రంగాల్లో స్థిరపడ్డారని తెలిపారు. ఈసందర్భంగా సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థినులు తమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం పూర్వ విద్యార్థినులను సన్మానించారు.

కుక్కలకు ఉచితంగా రేబీస్ టీకాలు



టీకా వేస్తున్న పశువైద్యురాలు కోటిరత్నం

ఫిరంగిపురం: రేబీస్ వ్యాధి బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయడమే జునొసిస్ డే ప్రధాన ఉద్దేశమని పశువైద్యాధికారి కోటిరత్నం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో జునొసిస్ డే సందర్భంగా కుక్కలకు యాంటీ రేబీస్ టీకాలు ఉచితంగా వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను జునొసిస్ వ్యాధులంటారన్నారు. 280 రకాల వ్యాధులు జంతువుల నుంచి మనుషులకు సంక్రమిస్తాయని తెలిపారు. వర్షాకాలంలో కుక్కలు ఎక్కువగా కరుస్తాయని, దీంతో కుక్కలకు రేబీస్ వ్యాధి రాకుండా వ్యాక్సిన్ వేస్తున్నట్లు చెప్పారు. పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేయించాలని కోరారు. అనంతరం కుక్కలకు వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పర్వీన్, చలపతి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న గెజిటెడ్ అధికారులు

తాడేపల్లిరూరల్ : రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం తాడేపల్లి పట్టణంలోని సీఎస్ఆర్ రెసిడెన్సీలో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రమణ అధ్యక్షత వహించగా.. పలు తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సునీల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎస్సీ ఎస్టీ ఉద్యోగులకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించి, వాటి పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళనున్నట్లు తెలిపారు. 2024-26 సంవత్సరానికి నూతన రాష్ట్ర కార్యవర్గ ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఆగస్టు 10న జరగబోయే రాష్ట్ర స్థాయి సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక ప్రక్రియ ఉంటుందన్నారు. అసోసియేట్ ప్రెసిడెంట్ హెచ్‌డీ ఈరన్న, రాష్ట్ర కోశాధికారి సీహెచ్ ఆనంద్, క్యాపిటల్ రీజియన్ ప్రెసిడెంట్ వైవీ సుధాకర్ బాబు, క్యాపిటల్ రీజియన్ ట్రెజరర్ డాక్టర్ ఒ.నాగరాజు, కృష్ణా జిల్లా జనరల్ సెక్రటరి ఎం.రాఘవులు, వివిధ జిల్లాలకు చెందిన సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన శ్రీవారాహి నవరాత్రులు



నగరంపాలెం: స్థానిక మల్లారెడ్డినగర్ శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవస్థానంలో రాజశ్యామల పీఠం తరఫున శనివారం వారాహి నవరాత్రులు శనివారం వైభవంగా ప్రారంభించారు. నిర్వాహకులు నాగార్జునశర్మ వారాహి అమ్మవారి మూలమంత్రాలతో హోమం చేశారు. వేద మంత్రాలతో ప్రాంగణం మార్మోగింది. విశేష ద్రవ్యాలతో హోమం చేసి పూర్ణాహుతి గావించారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. నాగార్జునశర్మ మాట్లాడుతూ ఈనెల ఆరో తేదీ నుంచి 15 వరకు వారాహి నవరాత్రులు నిర్వహిస్తామని అన్నారు. లోక కల్యాణార్థం ప్రతి రోజు హోమాలు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో లీలాకృష్ణ, దాసరి రాము భక్తులు పాల్గొన్నారు.